# ప్రొఫెసర్ హోడో



MVS PUBLICATIONS

మధుబాబు

# ప్రొఫెసర్ షాడో

*( షాడో స్పై థ్రిల్లర్)*

రచన:

మధుబాబు

*© Author*
*© Madhu Baabu*
*This digital book is published by -*

*కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.*

*సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.*

*All rights reserved.*

*No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.*

# ప్రొఫెసర్ షాడో

అదొక విశాలమైన హాలు. నేలమీద ఎర్రటి కార్పెట్ పరిచివుంది. తెల్లటి బాలీసులు అమర్చి వున్నాయి దాని మీద. ఆబాలీసులను ఆనుకొని పాతికమంది స్త్రీపురుషులు కూర్చునివున్నారు.

వారందరి చూపులూ ఎదురుగా చిన్న వేదికమీద నిలబడిన వ్యక్తిమీద వున్నాయి. ఐదు అడుగుల రెండు అంగుళాల ఎత్తున ఆ వ్యక్తి, తెల్లటి దుస్తులు ధరించి వున్నాడు. కళ్ళకు నీలంరంగు మెర్క్యూరీ గ్లాసులు గల కళ్ళజోడు పెట్టుకున్నాడు. అతని కళ్ళు వారికి కనిపించవ్. అతని భావాలను వారు గమనించలేరు.

ఖంగుమంటున్న గొంతుకతో వారిని వుద్దేశించి ప్రసంగిస్తున్నాడతను "మిత్రులారా మన కూటమిసభ్యులారా ఈ రోజు మనకు ఒక పర్వదినం. కిల్లర్స్ గ్యాంగ్ లాంటి

అంతర్జాతీయ కూటమితో కలసి పనిచేసి మన ప్రతిభను వెల్లడించుకోవాలనీ – ఎంతో కాలం నుంచి ఎదురుచూస్తున్నాం. ఆకోరిక

యీనాడు నెరవేరింది. కిల్లర్స్ గ్యాంగ్ మన కూటమిని తనలో కలుపుకోవటానికి అంగీకరించింది.”

పెద్దపెట్టున హర్షధ్వానాలు చేశారు స్త్రీ పురుషులందరూ. రెండు క్షణాలు ఆగి తిరిగి మాట్లాడటం ప్రారంభించాడు వేదికమీది వ్యక్తి.

కిల్లర్స్ గ్యాంగ్ ఆశయాలు మీకు అందరకూ తెలుసు. ప్రపంచాన్నంతా జయించి అన్ని దేశాలను ఒకే పతాకం కిందికి తీసుకురావాలని శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తున్నారు వారు. అందుకు ఒక ప్రయత్నంగా భారతదేశాన్ని ఆక్రమించుకోవాలని నిశ్చయించారు. "మైడియర్ మెంబర్స్! మనదేశ పరిస్థితులు యీనాడు అగమ్య గోచరంగా వున్నాయి. మన ఆర్థిక వ్యవస్థ నానాటికీ హీన స్థితికి దిగజారిపోతున్నది. ఎక్కడ చూసినా కరువు – కాటకాలు. ఎటు తల తిప్పినా ఆకలి చావులు. నిరుద్యోగసమస్యలు అంతా గందరగోళంగా తయారైపోయింది.

“లేడీస్ అండ్ జంటిల్‌మన్! ఈ ప్రమాద పరిస్థితులను ఎదుర్కోవటానికి ప్రభుత్వం అనేక రకాల పధకాలను చేపట్టింది. ముందుగా, ఆకలి మంటలను అణిచేటందుకు విదేశాల నుంచి

ఆహార పదార్థాలను దిగుమతి చేసుకోవటం ప్రారంభించింది. “మైడియర్ ఫ్రెండ్స్! మనదేశంలో వున్న విదేశ మారకద్రవ్య విలువలు ఎన్నడో కరిగిపోయాయి. వున్న బంగారాన్ని వెచ్చించి ఆయుధాలను సమీకరించుకోవటం జరిగింది. ఇక ఏం పెట్టి ఆహార పదార్థాలను కొనుగోలు చేయగలరు!” అంటూ సభ్యులవంక సూటిగా చూశాడతను. అందరూ తదేకంగా వింటున్నారు. సూది కిందపడినా వినిపించేటంత నిశ్శబ్దం ఆవరించింది. ఆప్రదేశాన్ని, ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ తిరిగి మాటలు మొదలు పెట్టాడతను.

“ప్రభుత్వం దివాళా తీయటానికి సిద్దంగా వుంది. దేశనాయకులందరికీ ఏం చెయ్యాలో తోచటంలేదు. ఈవిషమపరిస్థితిని ఆధారంగా చేసుకొని కిల్లర్స్ గ్యాంగ్ తన ఆశయాలను ఆచరణలో పెట్టాలని ఆశపడింది.

“కాని మిత్రులారా! ఆఖరి క్షణంలో సోవియట్ రష్యా కిల్లర్స్ గ్యాంగ్ ఆశలమీద చన్నీళ్ళు కుమ్మరించింది. రష్యా ప్రభుత్వపు సహకారంతో అరేబియా సముద్రంలో పెట్రోలు నిల్వలను కనిపెట్టే పధకాన్ని చేపట్టివుంది మన ప్రభుత్వం. నెలరోజుల క్రితం బొంబే నగరానికి రెండు

వందల కిలోమీటర్ల దూరంలో బ్రహ్మాండమైన పెట్రోలు నిల్వలను కనిపెట్టారు మన సైంటిస్టులు. ఆపెట్రోలును బయటికి తీయగలిగితే భారతదేశం ప్రపంచంలోకెల్లా సంపన్న దేశం అవుతుంది. ఒకరిని యాచించి బ్రతుకుతున్న మన దేశం ఇంకో రెండు సంవత్సరాలలో అగ్ర రాజ్యంగా మారిపోతుంది.

*"లేడీస్అండ్ అండ్ జంటిల్మెన్! యిది జరుగకూడదు. భారతదేశం కిల్లర్స్ గ్యాంగ్ గుప్పిటిలోకి రావాలంటే. యిప్పుడు వున్న సంక్షోభ పరిస్థితులే వుండాలి. ఆకలి మంటలకు తట్టుకోలేని పేద ప్రజానీకం – అధిక ధరల ముందు నిలువలేని మధ్యతరగతి కుటుంబీకులు. అందరూ ప్రభుత్వం మీద కినుక చెందాలి. నూతనంగా కనిపెట్టిన పెట్రోలు విలువలను ఆ తరువాత వెలికితీసి, ప్రపంచాన్నే ఒక ఆట అడించవచ్చు.*

"అరేబియా సముద్రంలో పరిశోధనలు జరుగుతునేవున్నాయి. ఆపెట్రోలును వెంటనే బయటికి తీయించాలని భారతప్రభుత్వం, సోవియట్ రష్యా పూర్తి సహకారాన్ని అర్థించింది. అందుకు సమ్మతించిన రష్యా , తన ఇంజనీర్లలో అపూర్వ ప్రతిభావంతులైన వారిని యిక్కడికి పంపిస్తోంది. వాళ్ళు అమిత మేధాశక్తి సంపన్నులు. రష్యా లో వున్న

అలాస్కా మంచు పర్వతాలనే పగులకొట్టి, ఆ మంచు ఎడారులను సస్యశ్యామలం చేసినటువంటి ప్రజ్ఞావంతులు.

“ వారు అరుగుదెంచిన మరుక్షణం భారత యింజనీర్ల శక్తి యుక్తులకు లొంగకుండా అరేబియా సముద్రంలో దాగుకొని వున్న పెట్రోలు నెలరోజుల్లో నీటిని వదిలి బయటకు వస్తుంది. భారతదేశపు ఆర్థిక వ్యవస్థ కన్నుమూసి కన్నుతెరిచేటంతలో మెరుగు

పడుతుంది. కిల్లర్స్ గ్యాంగ్ ఆశలు ఆడియాసలు అవుతాయి.

“నో మైడియర్ యంగ్ మెన్ అండ్ యంగ్ వుమెన్! ఈ పనికి విఘ్నాలు కల్పించాలని కిల్లర్స్ గ్యాంగ్ సుప్రీమ్ కమాండ్ నిర్ణయించింది. మనమీది అభిమానంతో ఈ మహాకార్యాన్ని మన భుజస్కంధాలమీద వుంచింది.

“ఫ్రండ్స్....ఎల్లుండి ఎనిమిదిగంటలకు మాస్కో నుంచి ఒక ప్రత్యేక విమానం బయలుదేరుతుంది. రష్యన్ యింజనీర్లు అందులోనే వస్తున్నారు.

'అడ్డిస్ ఆబాబా' అనే పట్టణంలో ఒక గంట సేపు విశ్రాంతి కోసం ఆగుతారు. అక్కడినుంచి సరాసరి బొంబే నగరానికి విచ్చేస్తారు.

"జంటిల్మన్....అడ్డిస్ ఆబాబాలోనే ఆ విమానాన్నిహైజాక్ చెయ్యాలి. మన మెంబర్లు కొంతమంది వెంటనే అక్కడికి వెళ్ళి అందుకు కావల్సిన ఏర్పాటు చెయ్యాలి. అవసరం అనుకుంటే ఆ స్పెషలిస్టులను చంపేయాలి. వాళ్ళు ఎట్టి పరిస్థితులలోనూ భారతదేశం చేరుకోగూడదు" అని ఆగాడు ఆ వ్యక్తి.

హాలులో వున్న వారందరూ తమలో తాము గుసగుసలాడుకోవటం ప్రారంభించారు. పదినిముషాల తర్వాత ఒక సభ్యుడు లేచి నిలబడ్డాడు.

"సర్! మనం అనుకున్నంత తేలికగా యి కార్యాన్ని సాధించలేమని అనిపిస్తోంది. కిల్లర్స్ గ్యాంగ్ సంగతి భారత ప్రభుత్వానికి బాగా తెలుసు. ఇటువంటి ప్రయత్నాలు జరుగుతాయని......తగిన జాగ్రత్తలు తీసుకోకుండా ఉంటారా?"

"ఆ విషయంలో మీరు కలతపడవలసిన అవసరంలేదు మైడియర్ ఫ్రండ్! మీశక్తి సామర్ధ్యాలమీద నాకు అపార మైన విశ్వాసం వుంది. మనం కలసికట్టుగా పనిచేస్తే ప్రభుత్వం ఏమీ చేయలేదు."

ఆపొగడ్తకు అందరి ముఖాలు వికసించాయి. లేచినిలబడిన సభ్యుడు మాత్రం అసంతృప్తిగా తల విదిలించాడు.

“మీరు ఒక విషయం మర్చిపోయారని చెప్పడానికి సాహసిస్తున్నాను సార్! ఇండియన్ సి.ఐ.బి. కిల్లర్స్ గ్యాంగ్ తో నిరంతరం పోరాటం జరుపుతున్నది. దాని ఏజెంట్ల దెబ్బకు కిల్లర్స్ గ్యాంగ్ వస్తాదులు హడలిపోతున్నారు. మరి ఈ విషయంలో సి.ఐ.బి. చేయివుంటే మనం చిక్కుల్లో పడతాం. సి.ఐ.బి. ఏజెంట్లను మనం ఎదిరించలేం " అన్నాడు.

వెదికమీది వ్యక్తి చిరునవ్వులు చిందించాడు. “అనవసరంగా భయపడకు మిస్టర్! అవసరం అనుకుంటే ముందుగా ఆ సి.ఐ.బి. ని, దాని ఏజెంట్లను మట్టిలో కలిపి మనపని పూర్తి చేసుకుందాం" అన్నాడు.

ఆ మాటలకు అదిరిపోయాడు సభ్యుడు. తెల్లముఖంవేసి నిలువుగుడ్లతో నిలబడి పోయాడు.

“వాట్ మిస్టర్? ఎందుకలా విచిత్రంగా చూస్తావ్?” కోపంగా ప్రశ్నించాడు వేదికమీది వ్యక్తి.

గుటకలు మింగాడు ఆ సభ్యుడు. గొంతు సవరించుకున్నాడు.

“సార్? మీకు సి.ఐ.బి. ని గురించి తెలుసా? దాని ఏజెంట్ల శక్తి ఎప్పుడైనా చవి చూశారా?” అని ప్రశ్నించాడు.

కోపంతో కందిపోయింది వేదికమీది వ్యక్తి ముఖం. “వాట్ నాన్సెన్స్ యువార్ టాకింగ్? మరొక్క మాట నీనోటినుంచి వెలువడితే ప్రాణాలు పోగొట్టుకుంటావ్ జాగ్రత్త?” అని హుంకరించాడు.

ఆ సభ్యుడు తల వంచుకున్నాడు. మిగిలిన వారిలో కలకలం చెలరేగింది. కండలు తిరిగిన శరీరంతో వస్తాదులా కనిపిస్తున్న మరొక సభ్యుడులేచి నిలబడ్డాడు.

" సర్! మనవాడుచెప్పినమాటలు నూటికి నూరుపాళ్ళుయదార్థాలు సార్! మన సభ్యులు అందరూ ఘటికులే. ఆందులో సందేహం లేదు. కాని , సి.ఐ.బి. ప్రసక్తి వచ్చిందికాబట్టి చెపుతున్నాను. ఈ పథకంలో దాని చెయ్యి వుంటే మనం తప్పుకోవటంమంచిదిసార్! సి.ఐ.బి. ని ఎదిరించటమంటే పులి తోక పట్టుకొని పరిహాసాలాడటం లాంటిది. వారి ముందు మనం నిలువలేం అన్నాడు.

మిగిలిన వారందరూ అతనితో ఏకీభవిస్తున్నట్టు తలలు వూపారు. ఎర్రబడిన ముఖంతో వారందరివంకా పదిక్షణాల పాటు చూశాడు వేదికమీది వ్యక్తి.

"ఆల్ రైట్! మీ మాటలే నిజమని వప్పుకుంటాను. నాకు సి.ఐ.బి.ని గురించి సరిగ్గా తెలియదు. తెలిసేటట్టు వివరంగా చెప్పండి" అన్నాడు వ్యంగ్యంగా.

“క్షమించాలి సర్! మీరు నా ఉద్దేశ్యాన్ని తప్పుగా అర్థంచేసుకొని మాట్లాడుతున్నారు. సి.ఐ.బి.ని గురించి ఎవరికీ పూర్తిగా తెలియదు. దానిదెబ్బరుచి చూస్తున్న కిల్లర్స్ గ్యాంగ్ సుప్రీమ్ కమాండ్ కూడా ఈ విషయంలో నిస్సహాయంగా ఉండిపోయింది. మాకు తెలిసింది ఒకే ఒక విషయం సార్ ! సి.ఐ.బి. లోని ఏజెంట్లు కందిరీగల లాంటివాళ్ళు. తరిమి తరిమి కొట్టటంలో వారిని మించిన వారు ఎవరూలేరు. సి.ఐ.బి. ఏజెంట్లు అందరూ ఒక ఎత్తూ......సీక్రెట్ ఏజెంట్ షాడో మరొకఎత్తు. మృత్యువునైన ఏమార్చవచ్చుగాని , ఈ షాడో బారినుంచి తప్పించుకోవటం కష్టం. కిల్లింగ్ లైసెన్స్ పొందిన భారతీయ ఏజెంట్ యితను ఒక్కడే! ఈ షాడో

నీడ మన మీదికి ప్రసరించిందంటే.....మనరోజులు దగ్గిర పడినట్లే అనుకోవచ్చు"అని ఆగి పోయాడా సభ్యుడు.

గంభీరంగా ఆలోచిస్తూ నిలబడి పోయాడు వేదిక మీది వ్యక్తి. రెండు నిముషాల తర్వాత సభ్యులందరినీ కలియచూశాడు.

"ఆల్ రైట్ మైడియర్ ఫ్రెండ్స్! మీ మాటల్లోని యదార్థాన్ని అంగీకరిస్తున్నాను. ముందు సి.ఐ.బి. సంగతి తేల్చుకుందాం. మీరు భయపడుతున్నట్టు అదికూడా రంగంలోకి దిగిందని నికరంగా తెలిస్తే మన ప్లానులను కొద్దిగా మార్చుకొని ముందుకు అడుగు వేద్దాం. ఈసీక్రెట్ ఏజెంట్ షాడో గురించి తెలిసిన వాళ్ళు యీ రాత్రి పదిగంటలకు నన్ను కలుసుకోండి. అతనే గనుక రంగంలోకి వస్తే ఏం చేయ్యాలో ఆలోచించుకుందాం" అన్నాడు.

ఆమోద సూచకంగా తలలు పూసి లేచి నిలబడ్డారు వారందరూ.

## 2

"......అదీ రాజు, అసలు విషయం" అంటూ సిగార్ని వెలిగించుకోవటానికి ఆగారు కులకర్ణి.

పనామా సిగరెట్ కాలుస్తూ శ్రద్ధగా ఆయన మాటలను వింటున్నాడు షాడో. మధ్య మధ్యలో ముందున్న ఫైలులోని వివరాలను చదువుకుంటున్నాడు. సిగార్‌ని వెలిగించుకొని గుప్పు గుప్పున పొగవదులుతూ అతనివంక చూశారు. "ఆ స్పెషలిస్టులను అనుసరించి వస్తారు కొందరు రష్యన్ ఏజెంట్లు. కొన్ని రాజకీయ కారణాల వలన వారు అక్కడినుంచి వెనుతిరుగుతారు. మనం వారి స్థానంలో నిలబడాలి. మన దేశభవిష్యత్తు ఆ స్పెషలిస్టుల మీద ఆధారపడి వుంది. వారికేదైనా ప్రమాదం సంభవిస్తే, మరో నాలుగు సంవత్సరాలదాకా అటువంటి మేధావంతులు దొరకరు. ఈలోపల మనం అనేక విషమ సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది."

"నువ్వు వెంటనే బయలుదేరి అడ్డిస్ ఆబాబా వెళ్ళాలి. అక్కడినుంచి స్పెషలిస్టులతో కలసి బొంబే దాకా ప్రయాణించాలి. బొంబేలో స్పెషల్ బ్రాంచి ఇనస్పెక్టర్లు సిద్ధంగా వున్నారు. విమానం నేలకు దిగగానే వారు నిన్ను రిలీవ్ చేస్తారు.!"

పనామాను యాష్ ట్రేలో కుక్కుతూ తల ఎత్తాడు షాడో.

“ఎవరైనా యీ ప్రయత్నాలకు అడ్డు తగలవచ్చని డెఫినిట్ గా తెలిసిందా?” అని ప్రశ్నించాడు. గంభీరంగా తలవూపారు కులకర్ణి. "అవును రాజు ! కలకత్తాలో వున్న ఒక లోకల్ క్రిమినల్ గ్యాంగ్. కిల్లర్స్ గ్యాంగ్ తో చేయి కలిపిందని మన శ్రీకర్ వార్త పంపాడు. వాళ్ళు ఏదైనా ప్రయత్నం చేయవచ్చు.”

“అది కాదు సార్! మనం అడ్డిస్ ఆబాబా దగ్గిర్నించి అలోచిస్తున్నాం గాని, దానిముందుకు చూడటం లేదు! మాస్కోనుంచి బయలుదేరిన దగ్గిరినుంచే వీరు తమప్రయత్నాలు ప్రారంబించరని గ్యారెంటీ ఏముంది? స్పెషలిస్టుల వెంట వస్తున్న సెక్యూరిటీ సిబ్బంది సమర్థవంతులేనా?”

"నన్నేం చేయమంటావ్ రాజు” అంటూ నుదురు రుద్దుకున్నారు కులకర్ణి. "ఈ ప్రభుత్వ విషయాలు మనకు అర్థం కావు. అడ్డిస్ ఆబాబా నుంచి మనల్ని హేండోవర్ చేసుకోమన్నారు. ఆదేశాల ప్రకారం నడుచుకోవటం మన విధి. పూర్తిగా మన సహాయం కోరితే పరువు తక్కువ అనుకుంటున్నారని నా అనుమానం " అన్నారు.

షాడో పెదిమల మీద చిన్న చిరునవ్వు ప్రత్యక్షం అయింది. "సార్! చైనా పంపినప్పుడూ నన్ను ఫ్లవర్స్‌బేలో ముంచినప్పుడూ యీ పరువు తక్కువ తనం అడ్డురాలేదు కాబోలు....."అన్నాడు.

మౌనంగా తల వూపారు కులకర్ణి. టైం చూసుకుంటూ లేచి నిలబడ్డాడు షాడో. "ఆల్ రైట్ సార్ !యీ సాయంత్రం ఆరు గంటలకు ఒక విమానం వుంది. దానిలో వెళతాను" అంటూ బయటకి వచ్చాడు.

ద్వారం దాకావచ్చి "విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్ రాజు! బికేర్ ఫుల్ !" అని హెచ్చరించారు కులకర్ణి.

ఆ మాటలకు నవ్వు కుంటూ – మెట్లవైపు అడుగులు వేశారు షాడో.

ఢిల్లీ – పాలం – విమానశ్రయంలో లండన్ బయలు దేరే విమానం ఒకటి కదలటానికి సిద్దంగా వుంది. లౌడ్ స్పీకర్స్ లో ప్రయాణీకులను హెచ్చరిస్తున్నారు కంట్రోల్ రూమ్ అధికారులు.

అదే సమయంలో ఒక ఎరుపు రంగు జాగ్వర్ స్పోర్ట్స్ కారు శరవేగంతోవచ్చి పార్కింగ్ లాట్‌లో ఆగింది. స్టీరింగ్ ముందునుంచి కిందికి దూకి వేగంగా అడుగులు వేస్తూ రన్‌వే వైపు బయలుదేరాడు షాడో.

రిసెప్షన్ హాలును దాటగానే కస్టమ్స్ గేటు వుంటుంది. వచ్చేపోయే ప్రయాణీకులను పూర్తిగా చెక్ చేసిగాని వదలరు అక్కడి సిబ్బంది.

" యువర్ పాస్‌పోర్ట్ ప్లీజ్!"అంటూ షాడో ముందుకు చేయిజాచాడు ఒక అధికారి.

పాంట్ జేబులోనుంచి ఒక కార్డునుతీసి అతనికి అందించాడు షాడో. "ప్రొఫెసర్ రాజు. జియాలజిస్ట్. పాట్నా యూనివర్శిటి" అని వ్రాయబడివుంది దాని మీద. షాడో ఫోటో ఒకటి అంటించి వుంది.

జియాలజీలో ప్రత్యేక పరిశోధనలు చేయడానికి అడ్డిస్ ఆబాబా వెళుతున్నాడు ప్రొఫెసర్ రాజు.

"లండన్ పోయే ఎయిర్ ఇండియా వారి బోయింగ్ విమానం రెండు నిమిషాల్లో కదలబోతున్నది" అంటూ ఒక మృదువైన కంఠం ఎనౌన్స్ చేసింది.

షాడో వెంట తీసుకుపోతున్న బ్రీఫ్ కేస్ ని పూర్తిగా పరీక్షించి గానీ అతనిని వదలలేదు కస్టమ్స్ అధికారులు.

రన్‌వే మీది విమానపు తలుపులు మూసుకుంటున్నాయి. మెట్లను యివతలికిలాగే జీపు విమానం పక్కకు వెళ్ళినిలబడింది.

కస్టమ్స్ అధికారులు వదిలిపెట్టగానే షాడో పరుగు పరుగున విమానం దగ్గరికి వెళ్ళాడు. అడుగుకు నాలుగు మెట్టు చొప్పున ఎక్కుతూవెళ్ళి, ఒక్క గంతులో విమానం లోనికి అడుగు పెట్టాడు. ద్వారం దగ్గిర నిలబడిన ఎయిర్ హోస్టెస్ అతన్ని చూసి నవ్వాలో – కోపగించుకోవాలో అర్థంకాక అయోమయంగా నిలబడిపోయింది. తలుపులు మూసుకున్నాయి. మెట్లు అవతలికి లాగబడ్డాయి. మెల్లగా కదిలి రన్‌వేమీద పరుగులు తీయడం ప్రారంభించింది విమానం.

సీటులో కూర్చుని బయటికి చూస్తూ తనలో తాను నవ్వుకున్నాడు షాడో. ఆ రోజు మద్యాహ్నం నుంచీ అతన్ని వెంటాడుతున్న నలుగురు వ్యక్తులు తెల్ల ముఖాలతో విజిటర్స్ గాలరీలో నిలబడి వున్నారు.

షాడో టిక్కెట్టు కొనుక్కోవటానికి వచ్చాడని అనుకున్నారుగాని, అలా అర్థాంతరంగా కదిలీ కదిలే విమానంలో ఎక్కి తమకు టోకరా యిస్తాడని వూహించలేకపోయారు.

# 3

ఢిల్లీ నుంచి బొంబేవచ్చి , అక్కడి నుంచి అరేబియా సముద్రం మీదుగా ఎగురుతూ లండన్ వైపు ప్రయాణం ప్రారంభించింది బోయింగ్ 707. ఆడ్డిస్ ఆబాబా చేరటానికి మరో మూడుగంటల వ్యవధి వుంది.

ఎయిర్ హోస్టెస్ అందించిన కాఫీ తాగుతూ , విమానంలోవున్న సినిమా పత్రిక నొకదాన్ని చూస్తున్నాడు షాడో.

విమానం భారత సముద్ర జలాలనుదాటి అంతర్జాతీయ ప్రదేశంలో ఎగురసాగింది.

కాఫీ కప్పును కింద పెడుతూ అప్రయత్నంగా ఎదుటి సీటు వైపు చూశాడు షాడో. అంతవరకు అతన్నే గమనిస్తున్న వ్యక్తి ఒకరు చటుక్కున తల తిప్పుకున్నాడు. పక్కలకు చూశాడు షాడో. అక్కడకూడా అంతే. అతని సీటుకు వెనుక ముందూ ప్రక్కలా వున్న నలుగురు వ్యక్తులూ అతన్నే పరిశీలిస్తున్నారు.

షాడో మెడ మీది వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి. ప్రమాదం ముంచుకు వస్తున్నదని హెచ్చరించ సాగింది అతని సిక్స్‌త్ సెన్స్.

తన భావాలను బయటికి కనిపించనీయకుండా మాగజైన్ చదువుతున్నట్టు తల వంచుకొని వారిని జాగ్రత్తగా పరీక్షించాడు. వారందరి దగ్గిరా న్యూస్ పేపర్లు వున్నాయి. గుండ్రంగా చుట్టి చేతికర్రల్లా పట్టుకొన్నారు. ఆ పేపర్లలో చుట్టివున్న రివాల్వర్లు షాడో సునిశిత నేత్రాలనుంచి తప్పకోలేకపోయాయి.

తను ప్రాణాలతో విమానం నుంచి దిగటం కష్టమని గ్రహించాడు షాడో. విమానం నేలను ఆనిన మరుక్షణం వాళ్ళు తనను చుట్టుముడతారు. ఆ రివాల్వర్లకు సైలన్సర్లు వున్నట్టు తెలుస్తూనే వుంది. ప్రయాణీకులు అందరూ దిగుతుండగా,తమ పనిని పూర్తి చేసుకొని కామ్‌గా దిగిపోతారు.

తనను మట్టు పెట్ట ప్రయత్నిస్తున్నది ఎవరో కాని, చాలా పకడ్బందీగా పధకంవేశారు. ముందు గొడవ లేకుండా ఢిల్లీ లోనే పైకి పంపించాలని చూశారు. ఆ ప్రయత్నం విఫలమైతే విమానంలో కొంత మందిని సిద్దంగా వుంచారు. అడిస్ ఆబాబాలో యింకెంత మంది కాచుకుని వున్నారో! అనుకొంటూ సీటులోనుంచి లేచాడు షాడో.

తాపీగా అడుగులు వేస్తూ బాత్‌రూమ్ వైపు బయలు దేరాడు. తలలు తిప్పి అతన్నే గమనిస్తున్నారు ఆ నలుగురూ.

నవ్వకొంటూ లోపలికి బాత్‌రూమ్ తలుపులు బంధించాడు. పనామా సిగరెట్‌ని వెలిగించుకొని మెల్లగా పొగ పీల్చి వదులుతూ తన పరిస్థితిని అంచనా వేసుకున్నాడు.

విమానంలో పోరాటం కుదరదు. మిగిలిన ప్రయాణీకుల ప్రాణాలతో చెలగాటం ఆడే అధికారం తనకు లేదు. సాధ్యమైనంత వరకూ ఎటువంటి గొడవాలేకుండా తప్పించుకునే ప్రయత్నం చేయాలి. తప్పించుకోలేకపోతే ప్రాణాలు వదలటానికి సిద్ధంగా వుండాలి.

పదినిమిషాలపాటు అక్కడే కాలం గడిపి, తలుపులు తెరిచాడు. ఎదురుగానే నిలబడి వున్నాడు ఒక వ్యక్తి. మిగిలిన ముగ్గురూ తమ సీట్లలోనే కూర్చుని అతనివంక చూస్తున్నారు.

గంభీరంగా వచ్చి తన సీటులో కూర్చున్నాడు షాడో. బాత్‌రూమ్ దగ్గరకి వచ్చిన వ్యక్తి కూడా తిరిగివచ్చి అతని సీటులో కూలబడ్డాడు.

ఒక గంట గడిచింది. విమానం ఎర్రసముద్రం సమీపాలకు వచ్చింది. ఉన్నట్లుండి అటూ ఇటూ వూగిపోయింది. ప్రయాణీకులందరూ

ఖంగారుపడటం ప్రారంభించారు....... రెండు క్షణాలలో సర్దుకుంది విమానం. ఇంటర్ కామ్ లో పైలట్ కంఠం మృదువుగా వినిపించింది.

" లేడిస్ అండ్ జంటిల్మన్ ! మనం తుఫాను మధ్య నుంచి ప్రయాణం చేస్తున్నాం. అనుకోకుండా తుఫాను చుట్టుముట్టటం వల్ల – విమానం కొంచెం ట్రబుల్ యిచ్చింది...... అంతా సరి పోయింది. మీరు ఖంగారు పడవలసిన అవసరం లేదు" అంటూ ప్రయాణీకులకు ధైర్యం చెప్పింది.

గాజు కిటికీలకున్న తెరలను పక్కకులాగి బయటకిచూశాడు షాడో. అంతా గాఢాంధకారం...... అసలే రాత్రి సమయం...... దానికి తోడుగా కారు మేఘాలు కమ్ముకొని వుండటంవల్ల అసలేమీ కనిపించటం లేదు.

విమానం చాలా కిందుగా ఎగురుతున్నట్లు – అస్పష్టంగా వినిపిస్తున్న యింజన్ల మోతనుబట్టి గ్రహించాడు షాడో.

ఆ వాతావరణాన్ని చూడగానే అతని మనస్సులో ఒక ప్లాను రూపుదిద్దుకోవటం ప్రారంభించింది.

మరో పావు గంట దాకా ఎటువంటి ట్రబుల్ యివ్వకుండా సాఫీగా నే ఎగిరింది బోయింగ్ 707. కాని పావు గంట గడిచిన తరువాత మళ్ళీ కుదుపులు ప్రారంభించింది. సుడిగాలిలో చిక్కిన ఎండుటాకులాగా – పిచ్చిగా –పక్కలకు ఒరిగిపోసాగింది.

బయపడిన ఒకరిద్దరు ప్రయాణీకులు కెవ్వుమని అరిచారు. ఎయిర్ హోస్టెస్ వారి దగ్గిరకు వెళ్ళి ధైర్యం చెపుతున్నది.

షాడో మీద నుంచి దృష్టిని మరల్చకుండా కూర్చున్నారు ఆ నలుగురు వ్యక్తులూ. వారి ముఖాలలో ప్రతిఫలిస్తున్న భావాలను చూసేసరికి తనకు టైం దగ్గరికి వచ్చిందని గ్రహించాడు షాడో.

విమానం మరింతగా కిందికి దిగిపోయింది. ఉండుండి ప్రత్యక్షమౌతున్న సముద్రపు అలలను గమనించాడు షాడో.

విమానం సముద్రం మీద ఐదువందల అడుగుల ఎత్తులో ఎగురుతున్నది. పైలట్ కంఠం ఇంటర్ కామ్ లో మరొక సారి వినిపించింది.

"ఫ్రండ్స్...ఈ తుఫాను లో ప్రయాణించటం చాలా కష్టం. అత్యవసర పరిస్థితుల మూలంగా అనువైన ప్రదేశం కనిపించిన

మరుక్షణం కిందికి దిగిపోతాం.... మీరు అధైర్యపడవద్దు విమానం సురక్షితంగానే వుంది" అంటూ చెప్పుకుపోతున్నాడు.

విమానం మరో వంద అడుగులు కిందికి దిగింది క్రింది నుంచి ఎగసిపడుతున్న అలలహోరు అస్పష్టంగా వినిపించ సాగింది.

ఎదుటి సీటులో కూర్చున్న వ్యక్తి లేచి నిలబడ్డాడు..... అతని చేతుల్లో వున్న పేపర్ యథాలాపంగా షాడో వైపు తిరిగింది.

సీటు పక్కన పెట్టుకున్న బ్రీఫ్ కేస్ ని అందుకున్నాడు షాడో. మెరుపు కంటే వేగంగా ఎత్తి గాజుకిటికీ కేసి బాదాడు. విమానపు అద్దాలు చాలా గట్టిగా వుంటాయి... సామాన్యంగా పగలకొట్టటం కష్టం. కాని షాడో చేతి లోని బ్రీఫ్ కేస్ సి.ఐ.బి. స్పెషల్ ఎఫెక్ట్ బృందంచేత తయారు చేయబడినటువంటిది. సరిగ్గా కొడితే దాని దెబ్బకు బండరాళ్ళే పిండి – పిండి అవుతాయి.

ప్రాణాలను చేతుల్లోకి తెచ్చుకొన్నట్లు కొట్టాడు షాడో. అద్దం పగిలి గాజు పెంకులు నలుదిక్కులకు చెల్లా చెదరయ్యాయి. చల్లటి గాలి రివ్వుమంటూ లోనికి దూసుకు వచ్చింది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=231**